# అటవీ సంపద పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- నూతన పీసీసీఎఫ్‌కు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం
- మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన పీసీసీఎఫ్ వినయ్ కుమార్
- మాజీ పీసీసీఎఫ్ సువర్ణకు ఘన సత్కారం





**విశ్వంభర, హైదరాబాద్** : రాష్ట్ర అటవీ దళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పీసీసీఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్.. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కలయికలో నూతన పీసీసీఎఫ్‌కు మంత్రి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం తదితర అంశాలపై వారు సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అటవీ రక్షణలో సాంకేతికతను విరివిగా ఉపయోగించుకోవాలని, పచ్చదనం పెంపుదలకు సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని పీసీసీఎఫ్‌కు దిశానిర్దేశం చేశారు.

### వార్షిక అవార్డుల నిర్ణయం హర్షణీయం: పీసీసీఎఫ్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందించేలా ఉత్తర్వులు జారీ చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

### మాజీ పీసీసీఎఫ్ సువర్ణకు సత్కారం

ఇటీవల పదవీ విరమణ పొందిన మాజీ పీసీసీఎఫ్ శ్రీమతి సువర్ణ సైతం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ శాఖకు సువర్ణ అందించిన విశిష్ట సేవలను మంత్రి కొనియాడారు. ఆమెను చీరతో సత్కరించి, పదవీ విరమణ అనంతర జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## మానవత్వం చాటుకున్న ఆర్‌జేడీ సోమిరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్** : బోయిన్‌పల్లికి చెందిన వికలాంగుడు తరుణ్ ఇద్దరు పిల్లలు భార్యతో జీవనం కొనసాగిస్తున్నారు. తన పిల్లలను ఓ ప్రైవేట్ స్కూల్ లో చదివించగా గతంలో పదవ తరగతి పూర్తి చేశారు. భార్య పిల్లలతో జీవనం ఎల్లదీస్తున్న తరుణ్ కి స్కూల్ ఫీజ్ లు కట్టటం కొంచెం ఇబ్బందిగా మారింది. అదే క్రమంలో పూర్తిగా ఫీజ్ చెల్లించలేని కారణంగా యాజమాన్యం తన పదవ తరగతి పూర్తి చేసిన సర్టిఫికెట్ ఇవ్వకుండా జ్యాపంచేసినందువల్ల ఎక్కడ తిరిగినా.. ఎవ్వరిని కలిసిన ఫలితం లేకుండా పోయింది . విషయం తెలుసుకున్న ఆర్‌జేడీ సోమిరెడ్డి తానే స్వయంగా వచ్చి పాఠశాల మేనేజ్మెంట్ తో మాట్లాడి సర్టిఫికెట్ ఇప్పించటం జరిగింది. అందుకుగాను తరుణ్ ఆర్‌జేడీ సోమిరెడ్డిని సన్మానం చేసి పూలబుకే ఇచ్చి కృతజ్ఞతా తెలియచేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ సోమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇక మీదట ఇలాంటి ఇబ్బంది ఉంటే నేను తరుణ్‌కు సహాయం చేస్తానని గతంలో కూడా చాల మంది పేద పిల్లలు, మన మీడియా మిత్రులకు కూడా ఫీజ్ లో రాయితీ కల్పినాని తెలిపారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి సహకరించండి

### కేంద్ర మంత్రికి సీతక్క విజ్ఞప్తి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో** : తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క.. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో న్యూఢిల్లీలో శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని మహిళా, శిశు సంక్షేమ పథకాలపై చర్చించి పలు వినతిపత్రాలు సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న అల్పాహారం, పాలు కార్యక్రమం విజయవంతమైందని, దీనికి కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాల్లో ప్రస్తుతం కేంద్రం ఇస్తున్న 20 శాతం వాటాను పెంచాలని విజ్ఞప్తి చేశారు. టీనేజ్ బాలికల్లో రక్తహీనతను తగ్గించేందుకు ప్రత్యేక పోషకాహార పథకం కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీతక్క కోరారు. తెలంగాణలో మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం తోడ్పాటు అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఫామ్‌రైతుల కోసం మరో ఆయిల్ పామ్ కర్మాగారం: మంత్రి తుమ్మల

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో** : రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతుల కోసం మరో ఆధునిక ఆయిల్ పామ్ కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో గోద్రెజ్ కంపెనీ నిర్మిస్తున్న ఆయిల్ పామ్ కర్మాగారం పనులు ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయని, త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని, అందుకోసం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన ఆకంపెనీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీడ్ గార్డెన్‌లో అధిక నూనె దిగుబడి ఇచ్చే, పొట్టి రకాల ఉత్తమ ఆయిల్ పామ్ మొక్కలను అభివృద్ధి చేయాలని వారికి సూచించారు. ఆయిల్‌పామ్‌కర్మాగారం సుమారు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారని, గంటకు 15 టన్నుల ఆయిల్ పామ్ గెలలను క్రష్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు అవుతోందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 150 మందికి ప్రత్యక్షంగా, 700 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గోద్రెజ్ సంస్థ ఇప్పటికే వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, వంటనూనెలు, సబ్బులు, ఆహార ఉత్పత్తుల తయారీలో ప్రముఖ స్థానంలో ఉందని, పామాయిల్‌ను తమ ఉత్పత్తులకు ముడిసరుకుగా వినియోగించే సామర్థ్యం ఉన్నందునే ఈ అవకాశాన్ని కల్పించినట్లు వివరించారు. రైతులకు గెలల ధరను నిర్ణయించే ఓఈఆర్ పై ప్రైవేట్ కంపెనీలు కోర్టుకు వెళ్లడం మంచిది కాదని, రైతులకు ఇబ్బందులు కలిగించే చర్యలు మానుకోవాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ వారిచే నడుస్తున్న మిల్లులలో ఏ మిల్లులలో అయితే ఎక్కువ ఓఈఆర్‌వస్తుందో దానిని గెలల ధరను నిర్ణయించడానికి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అప్పారావుపేట, అశ్వరావుపేటలలో ఆయిల్ పామ్ కర్మాగారాలు రైతులకు సేవలందిస్తున్నాయని, ఇటీవల సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో మరో ఆధునిక ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించామని, అంజనాపురం కర్మాగారంతో పాటు రాష్ట్రంలో మరో ఐదు ఆయిల్ పామ్ కర్మాగారాల నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

**2.97 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్‌సాగు..**

రాష్ట్రంలో ప్రస్తుతం 81,263 మంది రైతులు సుమారు 2.97 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. కొత్త కర్మాగారాలు అందుబాటులోకి రావడం ద్వారా మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉందన్నారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. సాగు చేస్తున్న రైతులు నేటి పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే ఎక్కువ ఆదాయం పొందుతున్నారని, ఉద్యోగులకు నెలకు ఒకసారి వేతనం వస్తే, ఆయిల్ పామ్ రైతులకు ప్రతి 20 రోజులకు ఒకసారి ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23,852గా ఉందని, ఇది పామాయిల్ చరిత్రలోనే అత్యధిక ధర అని చెప్పారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవేపై 200 కిలోల గంజాయి పట్టివేత

**విశ్వంభర, సత్తుపల్లి** : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేజర్ల సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై అక్రమంగా తరలిస్తున్న సుమారు 200 కిలోల గంజాయిని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు, సత్తుపల్లి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు టయోటా ఎతియోస్ కారులో గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో టీజీఏఎన్‌బీ బృందం, సత్తుపల్లి పోలీసులు సంయుక్తంగా గాలింపు చేపట్టారు. వేంసూరు మండలం గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న ఏపీ 39 ఏటీ 8420 నంబర్ గల టయోటా ఎతియోస్ కారును రేజర్ల సమీపంలో తనిఖీ చేయగా, అందులో సుమారు **200 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కారును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారిస్తున్న పోలీసులు గంజాయి సరఫరా నెట్‌వర్క్, ఇతర నిందితుల ప్రమేయంపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మోకు - గౌడు బతుకు కథలు గ్రంథావిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్** : గౌడుల జీవన విధానం, వృత్తి నేపథ్యాన్ని ప్రతిబింబించే 'మోకు - గౌడు బతుకు కథలు' సంకలన గ్రంథాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెల్దండ నిత్యానందరావు హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఓయూ ప్రొఫెసర్ రఘు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడుతూ గౌడులు సమాజ బాంధవులని, వారి వృత్తి సమాజంలోని అన్ని వర్గాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటుందని అన్నారు. గౌడుల జీవితాలపై తొలి కథా సంకలనంగా ఈ గ్రంథం నిలుస్తుందని, ఇతర వృత్తులపై కూడా ఇలాంటి సంకలనాలు తీసుకురావాలనే ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు.రచయిత జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సాహిత్యకారులు సమాజ చరిత్రను నమోదు చేసే బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. బహుజన వర్గాల చరిత్ర, వీరుల గాథలు సాహిత్యంలో మరింతగా ప్రతిబింబించాలని, బీసీల సాహిత్యానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ఓయూ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ ఆలస్యంగా చదువు ప్రారంభించిన వ్యక్తి అనేక గ్రంథాలు రచించడం అభినందనీయమని అన్నారు. సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకంపై సూచనలు చేయగా, బండారు రాజ్‌కుమార్ గ్రంథాన్ని సమీక్షించారు. గ్రంథ తొలి ప్రతిని ఆవునూరి శ్రీనివాస్ గౌడ్ మానసకు అందజేశారు. ఈ సందర్భంగా ధ్రువ ఫౌండేషన్ ప్రతినిధి దుండే మల్లేశం, గీత పనివారల సంఘం ప్రతినిధి బొమ్మగాని నాగభూషణం మాట్లాడారు. కార్యక్రమానికి విప్లవ్ కుమార్ ఆహ్వానం పలకగా, బోళ్ల ప్రవీణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో: రచయితలు పరిశోధకులు విజయ్‌కుమార్ మునిందర్ గోపి కార్తీక్ స్వాతి నవీన్ ప్రవీణ్ రాజశేఖర్ వెంకటేష్ విజయ్ యువరాణి శశాంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల చిరకాల వాంఛ సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరడం సంతోషం

### - ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి** : సదాశివపేట మండలం పొట్ పల్లి గ్రామం లో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డప్పు చప్పుళ్ళతో నిర్మలా జగ్గారెడ్డి కి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం తో పేదల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల నెరవేరుతుండటం సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామగ్రామాన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణం శరవేగంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ బిల్లుల మంజూరులో ఎక్కడా జాప్యం లేకుండా నిర్మాణానికి అనుకూలంగా నిధులు విడుదల అవుతున్నాయన్నారు. ఇప్పటికే వందల సంఖ్య లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు జరిగాయని, ఇందిరమ్మ ఇంటికి ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు వెంటనే చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో పొట్ పల్లి గ్రామ సర్పంచ్ గొల్ల రాములమ్మ లక్ష్మయ్య, కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న, మండల ప్రెసిడెంట్ ఒగ్గు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

### ప్రపంచ స్థాయి సాహస విజయాన్ని సాధించిన

## డా. రాజశేఖర్ రెడ్డికి ఘన సన్మానం




**విశ్వంభర, హైదరాబాద్** : జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య సేవల్లో విశేష కృషి చేస్తూనే ప్రపంచ స్థాయిలో అరుదైన సాహస విజయాన్ని సాధించిన శ్రీ మంజు హాస్పిటల్స్ రోబోటిక్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. రాజశేఖర్ రెడ్డిని కేపీహెచ్‌బీలోని శ్రీ మంజు హాస్పిటల్స్ లో యాజమాన్యం ఘనంగా సత్కరించారు. డా. రాజశేఖర్ రెడ్డి ప్రపంచంలోని అత్యంత ప్రతికూల వాతావరణం కలిగిన గ్రీన్‌ల్యాండ్ ప్రాంతంలో మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకుని విజయవంతంగా ట్రెక్కింగ్ పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. ఈ సాహసయాత్రలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ గౌరవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటారు. వైద్య వృత్తిలో అత్యాధునిక రోబోటిక్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు, క్లిష్టమైన జాయింట్ రీప్లేస్‌మెంట్, ట్రామా, స్పైన్ సర్జరీల్లో విశేష అనుభవం కలిగిన డా. రాజశేఖర్ రెడ్డి వేలాది మంది రోగులకు నూతన జీవితం అందిస్తున్నారు. 2021లో ప్రారంభమైన శ్రీ మంజు హాస్పిటల్స్ తక్కువ కాలంలోనే నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక అభినందన కార్యక్రమంలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్, ప్రముఖ వైద్యులు పాల్గొని డా. రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అచీవ్మెంట్ చేసిన వాటికి గాను అభినందించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా పిలుపు అందిందని యాజమాన్యం తెలిపింది.

## శ్రీ బోనమ్మ తల్లి మహోత్సవాల్లో డా. ఏ చంద్రప్రియ



**విశ్వంభర, వికారాబాద్** : శ్రీ బోనమ్మతల్లి సహిత సప్తమాతృక గ్రామ దేవతా ఆలయ జీర్ణోద్ధరణ, నూతన విగ్రహముల పునః ప్రతిష్ఠా మహోత్సవం వికారాబాద్ మున్సిపాలిటీలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్, వారి కుమార్తె డా. ఏ. చంద్రప్రియ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో, వేద మంత్రాలతో మార్మోగింది. అమ్మవారి ఆశీస్సులు వికారాబాద్ ప్రజలందరిపై ఉండాలని అలాగే అన్ని వర్గాల ప్రజలందరూ సుఖ సంతోషాలు ఉండాలని కోరారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### - మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, బడంగ్ పేట్** : రక్తదానం ప్రాణదానంతో సమానం అని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ మెకానిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని థలసేమియా బాధిత చిన్నారుల కోసం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రక్తదాతలను అభినందిస్తూ, రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమైన గొప్ప సేవ అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 196 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, థలసేమియా బాధిత చిన్నారులకు ఆశాకిరణాలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నరేందర్ యాదవ్, రమేష్ రావు, కె నరసింహ ,విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు అర్కల కామేష్ రెడ్డి, అర్కల భూపాల్ రెడ్డి, అనిల్ యాదవ్, మదారి రమేష్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సునీత బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

### నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు



**విశ్వంభర, ఖమ్మం** : నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు అని గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సి. యల్. యాదగిరి, జజ్జనక కళా మండలి కో కన్వీనర్ బంటు వెంకటేష్ లు అన్నారు. ఖమ్మంలో మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు కన్ను మూసిన సాంస్కృతిక సేనాని నాగన్నకు అణగారిన ప్రజల హక్కుల పోరాట కమిటీ, గద్దర్ అభిమానుల సంఘం, జజ్జనక కళా మండలి, తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబసభ్యులకుతమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. నాగన్న క్రమశిక్షణ కలిగిన జీవితం అని కొనియాడారు. తానుచివరి శ్వాస వరకు నిజమైన కార్మికవర్గ నాయకుడిగా కోనసాగి, ఎందరో విప్లవ సాంస్కృతిక సైనికులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. నాగన్న గత కొంత కాలంగా తీవ్ర అనా రోగ్యానికి గురై చావు అంచులదాక వెళ్లి మరణాన్ని జయించిన వీరుడిగ ప్రశంసలు అందుకొన్న కొద్ది రో జులకే తుదిశ్వాస విడిచారు అని అన్నారు.

## సర్‌పై అవగాహన సదస్సు

**విశ్వంభర, మీర్‌పేట్** : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్ ప్రోగ్రాం పై ప్రజలలో, ఓటర్లలో అవగాహన కల్పించుటకు బడంపేట్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ కాలనీల యొక్క వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి లకు సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలో అవగాహన కల్పించారు. అయోధ్య నగర్ కాలనీ కాలనీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బళ్లారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో గల ఓటర్లందరికి బి ఎల్ ఓ లు ఓటర్ల ఫార్మ్స్ సరిగా పంపిణీ చేయడం లేదని, ప్రతి ఒక్క ఓటర్ కు మేము అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రతి ఇంట్లో గల ప్రతి ఒక్క ఓటర్ కు ఫామ్ లు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ కు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి కూర రమేష్ , ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

